ఆచార్యా.. మీకిది తగునా..!

'ఐ సెట్' నిర్వహణ నిధులు పక్కదారి



విద్యానగర్, న్యూస్‌టుడే: ఆయన కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఆచార్యుల్లో ఒకరు. ఏకంగా ఐసెట్ నిర్వహణ నిధులపై కన్నేశాడు.. 'లెక్క' తేలని కారణాలు చెబుతూ పెద్ద మొత్తంలో దారి మళ్లించాడు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఐసెట్ ఒకటి. దాని నిర్వహణ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీకి అప్పగించారు. దీని నిర్వహణ కోసం ఉన్నత విద్యామండలి కేటాయించిన నిధులను ఈ ఆచార్యుడు దారి మళ్లించినట్లు సమాచారం. 2024 -25 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి పత్రికా ప్రకటన, సీఈటీ సమావేశానికి, కాన్ఫిడెన్షియల్ పనులు, వేతనాలు, అతిథ్యం, రవాణా, సామగ్రి ఖర్చు, స్టేషనరీ తదితర వాటికి రూ.99.50 లక్షలు అవసరం అవుతాయని ఐసెట్ కన్వీనర్ ఉన్నత విద్యామండలికి ప్రతిపాదన పంపిస్తే రూ.92.76 లక్షలను కేటాయించింది. వాటిలో కొన్నింటికి తక్కువ ఖర్చు అయినా ఎక్కువ అయినట్లు లెక్కలు చూపించి రూ.29.25 లక్షలను ఆ ఆచార్యుడు తన వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం ఉన్నత విద్యా మండలి దృష్టికి వెళ్లింది.

బదిలీ ఇలా

ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.6 లక్షలు, మార్చిలో రూ.5 లక్షలు, ఏప్రిల్‌లో రూ.7 లక్షలు, మే నెలలో రూ.8 లక్షలు, ఆగస్టులో రూ.3.25 లక్షల చొప్పున మొత్తం రూ.29.25 లక్షల అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. ఆరు నెలల్లో రూ.16 లక్షలను సెల్ఫ్ చెక్‌లతో విడుదల చేసుకున్నట్లు సమాచారం. వాటిని ఐసెట్ కాన్ఫిడెన్షియల్ విభాగం ఖర్చు కోసం వాడాలి. వాటిని వినియోగించిన తీరు ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. రవాణా ఖర్చులు నిమిత్తం నెలకు రూ.40 వేలు తీసుకున్నారు. ఐసెట్ పరీక్ష నిర్వహణలో సంబంధం లేని ఒక పెద్దసారుకు వేతనం పేరుతో రూ.2 లక్షలు చెల్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐసెట్ కార్యాలయంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి ఖాతాలోకి ముందు నగదు జమచేసి ఆ తర్వాత విడుదల చేసుకున్నట్లు సమాచారం. విశ్వవిద్యాలయానికి ఎలాంటి సంబంధం లేని మహిళ పేరున రూ.82,600 తీసుకోవడం పట్ల నగదు అక్రమ బదిలీ జరిగినట్లు ఆరోపణలు. కంప్యూటర్ల కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారు. ఒక్కో కంప్యూటరును రూ.87,849 చొప్పున ఆరింటిని వేర్వేరు దుకాణాల్లో కొనుగోలు చేసినట్లు చూపించారు. ఏవిధమైన కొటేషన్లు, కమిటీ అనుమతి లేకుండానే కొనుగోలు చేయడం గమనార్హం.

ఐదుగురు ఏఈవోల సస్పెన్షన్

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఐదుగురు వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ మంగళవారం తెలిపారు. రైతు బీమా నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాజీపేట మండలానికి చెందిన ఏఈవోలు రజిత, భరత్, ఐనవోలు మండలానికి చెందిన ఆఫ్రిన్, ఆత్మకూరు మండలానికి చెందిన ప్రవళిక, శాయంపేట మండలానికి చెందిన అర్చనలను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

రీజియన్‌కు తొలి ఎలక్ట్రికల్ బస్సు

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. దశల వారీగా ఉమ్మడి జిల్లాకు మొత్తం 82 ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించినట్లు ఇటీవల అధికారులు ప్రకటించిన విషయం విదితమే. వీటిని హైదరాబాద్ - వరంగల్ రూట్‌లో తిప్పనున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత తొలి బస్సు వరంగల్-2 డిపోకు చేరుకుంది. బస్సులకు ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం బస్సులు వచ్చాక సర్వీసు ప్రారంభించనున్నారు. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా




వరంగల్2 డిపోలో బస్సుల ఛార్జింగ్ పాయింట్

మూడు వైపులా.. కష్టాలే! కథనం 6లో..

కాజీపేట బస్టాండ్‌కు స్థలం ఇవ్వండి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేట బస్టాండ్ నిర్మాణం కోసం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రయత్నాలు మొదలు పెట్టారు. మంగళవారం సికింద్రాబాదు డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్‌కుమార్‌ను కలిసి కాజీపేటలో బస్టాండ్, కొత్త వంతెన నిర్మాణం, కమర్షియల్ కాంప్లెక్స్ ఆవశ్యకత గురించి వివరించారు. రోజు రోజుకు కాజీపేటలో ప్రయాణికులు, వాహనాల రద్దీ పెరుగుతోందని, హైదరాబాదుకు వెళ్లే ప్రయాణికుల కోసం బస్టాండ్ అవసరం ఉందని వివరించారు. కాజీపేట స్టేషన్ పరిసరాల్లో రైల్వేశాఖ స్థలాలు ఎక్కువగా ఉన్నాయని, దీన్ని లీజు లేదా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే ప్రజలకు మేలు కలుగుతుందని వివరించారు. ప్రస్తుతం కాజీపేట చౌరస్తానుంచి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందికరంగా ఉందని, అందుకే స్టేడియం, క్వార్టర్స్‌కు సంబంధించిన స్థలం కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం బస్టాండ్ నిర్మాణం చేస్తుందని తద్వారా ట్రాఫిక్ నియంత్రణకు అవకాశం ఉంటుందని కోరారు.



బస్టాండ్ ఆవశ్యకతను డీఆర్ఎం భర్తేష్‌కుమార్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

సమయపాలన పాటించరా..



మంగళవారం ఉదయం 10:12 గంటలకు తాళం తీస్తున్న అటెండర్



10:55 అయినా కుర్చీలు ఖాళీ

సాక్షాత్తు జిల్లా పాలనాధికారి ఉండే కలెక్టరేట్ భవనంలో కొనసాగుతున్న భూగర్భ గనుల శాఖ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. అడిగేదెవరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా ఒక కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ తప్ప ఎవరూ కనిపించరు. అడిగితే క్షేత్ర పరిశీలన, తనిఖీలకు వెళ్లారని సిబ్బంది బదులిస్తారు. ప్రతి రోజు ఉదయం 10:15 నుంచి 10:30 గంటల మధ్య కార్యాలయం తాళం తీస్తారు. ఏడీ, ఆర్ఐ, టీపీ, జూనియర్ అసిస్టెంట, సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ కలిపి మొత్తం ఆరుగురు విధులు నిర్వహిస్తున్నారు. రోజూ రిజిస్టర్‌లో ఫీల్డు విజిట్ చేసినట్లు నమోదు చేస్తున్నారు. ఎక్కడా అక్రమాలను అరికట్టింది మాత్రం లేదు. – న్యూస్‌టుడే, ఐనవోలు (హనుమకొండ)

విలువైన స్థలం.. కబ్జా అయ్యే ప్రమాదం



నాడు



నేడు

నగర నడిబొడ్డున కొన్ని ప్రభుత్వ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఓ వైపు కార్యాలయాలకు అద్దె భవనాలు తీసుకొని నెలకు రూ.వేలు చెల్లిస్తున్నారు. మరోవైపు ఉన్న స్థలాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. హనుమకొండ బ్రాహ్మణవాడలోని మున్సిపల్ క్యాంప్ ఆఫీసు స్థలమే దీనికి ఉదాహరణ. ఇక్కడ 2013కు ముందు ప్రభుత్వ బాలికల పాఠశాల భవనం ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో మరోచోటికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఖాళీ స్థలం ఉండడంతో చెత్తాచెదారం వేస్తున్నారు. అధికారులు పట్టించుకోకుంటే స్థలం కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని స్థానికుడు, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా బస్తీ దవాఖాన నిర్మిస్తే బాగుంటుందని కోరుతున్నారు. – ఈనాడు, హనుమకొండ

చర్యలుంటాయా.. మామూలేనా!

సీఎంఆర్ బియ్యం బుక్కి రూ.కోట్లు గడించిన మిల్లర్లు



గత నెల 20న బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన శ్రీ లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 యాసంగి సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 62579.80 క్వింటాళ్ల ధాన్యం కేటాయించింది. మిల్లరు సీఎంఆర్ కింద ధాన్యం మరాడించి 42553.58 క్వింటాళ్ల బియ్యం అందజేయాల్సి ఉండగా 24,336 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చి మిగతాది బకాయిపడ్డారు. అందుకు సంబంధించిన రూ.6.49 కోట్ల విలువైన 26,790 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గత నెల 20న మిల్లులో చేపట్టిన దాడుల్లో గుర్తించింది. ఈ మిల్లు జిల్లాలో పేరున్న ఒక మాజీ ప్రజాప్రతినిధిది. గతేడాది వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపు నిలిపివేయగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు.

● మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచెర్ల శివారులోని నవ్య పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 సీజన్‌లో పౌరసరఫరాలశాఖ 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. మిల్లర్లు సీఎంఆర్ కింద 36,240 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా 8,871 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 27,549 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలి. మిగతా 40,513 క్వింటాళ్ల ధాన్యంలో కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దాంతో మిల్లరు ప్రభుత్వానికి రూ.8.36 కోట్లు నష్టపరిచినట్లు గత నెల 21న మిల్లులో తనిఖీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ బృందం పేర్కొంది.

ఈనాడు, మహబూబాబాద్

ఉమ్మడి వరంగల్‌లోని కొంత మంది రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లాడించి సకాలంలో బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో మూడు, నాలుగు సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇవ్వని వారున్నారు. వీరికి పలుమార్లు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బకాయిపడ్డ మిల్లర్లు కొందరు ధాన్యాన్ని అడ్డదారిలో అధిక ధరలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. వీరిపై ఈసారైనా చర్యలు తీసుకుంటారా లేదా ఎప్పటిలాగే 'మామూలు'గా వదిలేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

టాస్క్‌ఫోర్స్

ఇలా జరగాలి..

మిల్లులకు ధాన్యం కేటాయించిన తర్వాత అక్కడ లెక్క ప్రకారం నిల్వలున్నాయా.. లేవా, మిల్లాడిస్తున్నారా.. లేదా అనేది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా పౌరసరఫరాలశాఖ వద్ద సరిపడా సిబ్బంది లేదు. దాంతో పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా స్థాయిలో రెవెన్యూ అదనపు కలెక్టర్లు, మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించారు. వారు మిల్లులను పరిశీలించి బియ్యం నిల్వల నివేదికలను రాష్ట్ర అధికారులకు అందించాలి. తేడా లున్న మిల్లులకు మరో సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపు నిలిపివేస్తారు.

ఇదీ జరుగుతోంది..

మిల్లర్ల అక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వకపోవడం వల్లనే ఒక సీజన్‌ది కాస్త నాలుగు సీజన్లకు పెరిగింది. ఇందుకు అధికారులు మిల్లర్ల నుంచి రూ.లక్షల్లో ఆమ్యామ్యాలను పుచ్చుకుంటూ ధాన్యం కేటాయింపులకు సహకరించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని మిల్లలకు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయించారు. అప్పుడు కూడా అధికారుల అండదండలతో పక్కదారి పట్టించారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 94 మంది రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించలేదు. ● వీరిలో రెండు, అంతకంటే ఎక్కువ సీజన్లు బకాయి ఉన్న వారికి ప్రస్తుత సీజన్ నుంచి ధాన్యం కేటాయింపు నిలిపివేయాలనేది పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. మిల్లర్లు కొందరు ధాన్యం కేటాయింపుల కోసం గతంలో మాదిరిగానే అధికారులను మచ్చిక చేసుకోవడానికి మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

బియ్యం బకాయిపడ్డ మిల్లర్లు (సీజన్లవారీగా)

జిల్లా	ఒకటి	రెండు	మూడు	నాలుగు	మొత్తం
హనుమకొండ	19	3	1	1	24
జనగామ	9				9
భూపాలపల్లి	9				9
వరంగల్	24	5			29
మహబూబాబాద్	16	5			21
ములుగు	5	1			6

రహదారి భద్రతకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణ పనులు నవంబరు 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, డీసీపీలు రవీందర్, సలీమ, ఏసీపీలు కిషోర్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్, సత్యనారాయణ, ఆర్టీసీ, జాతీయ రహదారులు, వైద్యారోగ్య, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిశుగృహ సందర్శన..

బాలసముద్రం: జిల్లా కేంద్రంలోని శిశుగృహను కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం సందర్శించారు. చిన్నారుల దగ్గరకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం బాలల సంక్షేమ సమితి, పరిరక్షణ విభాగం అధికారులతో సమీక్షించారు. వసతుల సౌకర్యాలను పరిగణలోకి తీసుకొని ప్రస్తుత కేంద్రంతో పాటు అదనంగా మరోటి ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలకు ఒకటి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాకు ఒకటి చొప్పున కేంద్రాలు ఉండాలన్నారు. ఖాళీ పోస్టులను గుర్తించి రాష్ట్ర సంచాలకులకు నివేదిక పంపించాలని చెప్పారు. చిన్నారులకు జీఎంహెచ్ మదర్ మిల్క్ సెంటర్ నుంచి పాలు తెప్పించాలని సూచించారు. ఆమె వెంట డీఎంహెచ్ఓ డా.లలితాదేవి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు తదితరులున్నారు.

ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవర్చుకోవాలి

ఎంజీఎం ఆసుపత్రి: ఆరోగ్యవంతమైన జీవనశైలిలో భాగంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో పాటు యోగా, ధ్యానాన్ని అలవర్చుకునేలా అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. మంగళవారం వరంగల్ కాకతీయ వైద్య కళాశాల సమావేశ మందిరంలో ఆర్య జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు కల్పించాల్సిన అవగాహన కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి జయంతి, ఆర్యజనని అధ్యక్షుడు అనుపమరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వంతెనను గుర్తుంచుకోండి

రేపు రైల్వే అభివృద్ధి పనులపై ఎస్‌సీఆర్ జీఎంతో ఎంపీల సమావేశం



న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట కొత్త రైల్వే వంతెన నిర్మాణం పనులు సంవత్సరాల తరబడి అసంపూర్తిగా ఉన్నాయి. రైల్వేలైన్‌కు అటు, ఇటు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ఎప్పుడో పూర్తి చేశారు. కేవలం పట్టాలపై మాత్రమే మిగిలి ఉన్నాయి. రైల్వే అధికారులను అడిగితే.. ఆ పనులు కూడా గుత్తేదారే చేయాలని, తాము ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సంయుక్తంగా పర్యవేక్షణ మాత్రమే చేస్తామని చెబుతున్నారు. దీనిపై ఎంపీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే అభివృద్ధి పనులపై ఈ నెల 24న దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ మిశ్రా సికింద్రాబాదులో ఎంపీలతో సమావేశం కానున్నారు. అందుకని కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను తెలుసుకోవడానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, ప్లాట్‌ఫారాల నిర్మాణం, రైల్వే క్వార్టర్స్ తదితర పనులను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా కాజీపేట కొత్త ఆర్వోబీ పనులపై కూడా శ్రద్ధ పెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. 1976లో నిర్మించిన పాత వంతెన శిథిలావస్థకు చేరింది. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో దానిపై భారం పడుతోంది. రూ.78 కోట్లతో చేపట్టిన కొత్త వంతెన పనులు పూరైతే పాత వంతెనపై భారం తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరుతుంది. దీని ప్రాముఖ్యతను సమావేశంలో రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి ఎంపీ కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఎంపీ కడియం కావ్యను వివరణ కోరగా ఆర్వోబీని ప్రధాన సమస్యగా తీసుకొని ప్రస్తావిస్తామని, ఇతర రైల్వే సమస్యలపై కూడా జీఎంతో మాట్లాడతామని చెప్పారు.

మూడు వైపులా.. కష్టాలే!

● పద్మవ్యూహంలో హనుమకొండ బస్టాండ్
● ఛేదించడానికి ఉన్నాయి మార్గాలు

పరిశీలన

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..
–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

ఎవరికి నచ్చినట్టు వారు..


ఆటోలు, ఫుట్‌పాత్‌లపై వాహనాలు

బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటో వాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.

కట్టడి చేయడం కీలకం

☛ ఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి. ☛ బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.


ఇది కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్టాండ్‌లోని బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలి



సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- నార్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండ



బస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షిరోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

ప్రైవేటు వాహనాలను అడ్డుకుంటున్నాం..

- విజయభాను, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్



బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకకు పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.


ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంతో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది.

మూడు మార్గాలు ఉన్నా..

బస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.

ఇలా చేద్దాం

☛ గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి.
☛ ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట దారుల్లో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి.
☛ హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.
☛ ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.


ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..

వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు	9
మొత్తం బస్సులు	908
నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య	60 వేలు
ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు	1200
ప్రయాణించే మార్గాలు	374

ఇదీ పరిస్థితి


ములుగు రోడ్డు బస్టాండు

హనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్క పక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారం

☛ హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్ స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి.
☛ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.
☛ ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.
☛ కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.
☛ రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.


కాజీపేట బస్టాండు


విలేకరుల సమావేశంలో కథానాయిక అనన్య, హీరో యువ చంద్రకృష్ణ

'పొట్టేల్' సినిమా బృందం సందడి


కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో 'పొట్టేల్' సినిమా బృందం సందడి చేసింది. ఆకట్టుకునే కథ, మెప్పించే కథనంతో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'పొట్టేల్' సినిమాను ఆదరించాలని కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య ప్రేక్షకులను కోరారు. మంగళవారం వరంగల్ వెంకట్రామా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన నిశాంత్ రెడ్డి, సురేశ్ చిత్రాన్ని నిర్మించారని, పక్కా పల్లె వాతావరణం, చిన్నపాప చదువు కోసం మేం పడిన కష్టం ఈ సినిమాలో కనిపిస్తుందని చిత్ర బృందం తెలిపింది. గురువారం సినిమా విడుదలవుతోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశామని, తెలంగాణలో వరంగల్ నుంచే మొదలు పెడుతున్నామని వివరించారు. ఓటీటీలో కాకుండా సినిమాను థియేటర్‌లోనే చూడాలని అభ్యర్థించారు. అంతకు ముందు హీరో యువ చంద్రకృష్ణ తీన్మార్ డాన్స్ చేశారు. సమావేశం అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు. కథానాయిక అనన్యతో స్వీయచిత్రం దిగడానికి అభిమానులు పోటీపడ్డారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25న నిర్వహించాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా వేస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇతర క్రీడాంశాలు షెడ్యూల్ ప్రకారమే ఉంటాయన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)			
ఫాంరేటు:	125	డ్రెస్డ్:	213
రిటైల్:	147	స్కిన్‌లెస్:	243

ప్రధాని మోదీ ప్రత్యుత్తరం.. మురిసిన విద్యార్థులు


प्रधान मंत्री
Prime Minister
New Delhi
01 October, 2024
Shri Nagchetanya Ji,
Heartfelt gratitude to you for sending warm birthday wishes. I am overwhelmed to receive greetings from my family members such as yourself from across the country.
Your trust, support and cooperation are my real treasure. Your affectionate words fill me with new energy to strive in service of the nation. In the third term of our government, my resolve to fulfil the aspirations of the people and take India to great heights of progress has further strengthened.
Powered by the ability of our people and the skills of our youth, we have been setting new benchmarks in development over the last 10 years. Amrit Kaal is an opportunity to scale up our efforts to build a developed, inclusive and self-reliant nation.
The contribution of every Indian towards the progress of the nation is deeply valued.
With best wishes for your good health, happiness and prosperity.
Yours,
(Narendra Modi)
Shri Nagchetanya
Near Hanuman Temple
Telangana

గుండెంగ యూపీఎస్ విద్యార్థులకు ప్రధాని రాసిన ప్రత్యుత్తరం


ప్రధాని రాసిన లేఖలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

దేవరుప్పుల (జనగామ జిల్లా), మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7వ తరగతుల విద్యార్థులు వారంతా.. పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొడిపాక రమేశ్ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ హిందీలో లేఖలు రాసి పోస్టు చేశారు. సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి 'ధన్యవాదాలు' అంటూ ప్రత్యుత్తరం అందింది. దీంతో ఆ పల్లె వాసులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కిషన్, చీకటి శ్రీను, కందిక దామోదర్, ప్రధానోపాధ్యాయుడు రాజు సమక్షంలో వాటిని విద్యార్థులకు అందించడటంతో పండగ వాతావరణం నెలకొంది.

భద్రపరుచుకుంటాం..



- మణిహర్షిత, ఏడో తరగతి

గత నెలలో పోస్టుకార్డుతో ప్రధాని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ మాస్టారు లేఖ రాయమంటే రాసి మరిచిపోయాం. ప్రస్తుతం తిరిగి లేఖ రావడంతో విద్యార్థులం అంతా చాలా ఆనందపడ్డాం. ఆంగ్లంలో వచ్చిన లేఖను ఉపాధ్యాయులు చదివి తెలుగులో వివరించారు. దేశ ప్రధాని నుంచి వచ్చిన ప్రత్యుత్తరం ఫ్రేమ్ కట్టించి ఇంట్లో భద్రపరుచుకుంటాం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు. దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ. 800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్ర లేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ. 2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం


పోటీపడుతున్న క్రీడాకారులు


వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు మంగళవారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ. శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం బాలలతో చదరంగం ఆడి ఉత్తేజపరిచారు. పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా, ఆర్బిటర్స్ సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

సీతాఫలాల విక్రయాలు.. రాకపోకలకు తిప్పలు!




జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు వైపు యూటర్న్ వద్ద బైపాస్ రహదారిపైనే సీతాఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు సీతాఫలాల కొనుగోళ్లకు ఆగడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి పక్కగా కూర్చుంటే ఇబ్బందిగా ఉండదని విక్రయదారులుకు పోలీసులు సూచిస్తున్నారు.
– న్యూస్‌టుడే, జనగామ టౌన్

వరిసాగు అందం.. తేయాకు తోటల చందం



ఈ చిత్రం చూస్తుంటే అస్సాం రాష్ట్రంలోని తేయాకు తోటలను తలపిస్తున్నాయి కదూ. ఇది వరి విత్తనోత్పత్తి క్షేత్రం. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ శివారులో కావేరి విత్తన సంస్థ ఆధ్వర్యంలో రైతు ఆడ, మగ వరిని నాటారు. మగ వరి కోసి వేరు చేయడంతో మిగిలిన పంట తేయాకు తోటలో పాదుల్లాగ ఇలా కనిపిస్తోంది. దారిన పోయే బాటసారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.
– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

హరిత గిరి.. కొలువైన శ్రీహరి



పచ్చదనంతో అలరారుతూ ఆహ్లాదకరంగా ఉన్న ఈ కొండ హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని ఎర్రగట్టు గుట్ట. దీనిపై అనేక రకాల ఔషధ మొక్కలు, మధుమేహాన్ని నియంత్రించే తిప్పతీగ, చర్మ వ్యాధులను నయం చేసేందుకు వాడే గడ్డిపూల జాతి మొక్కలు ఉన్నాయి. వీటితో నల్లనేరేడు, సీతాఫలాలు, వేప తదితర వృక్షాలు ఉన్నాయి. ఈ గుట్టపైనున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీహరి భక్తులకు కనువిందుగా దర్శనమిస్తున్నారు.
– ఈనాడు హనుమకొండ, న్యూస్‌టుడే భీమారం


పార్కు ముఖద్వారం


నెలకొన్న పచ్చదనం


ఓపెన్‌జిమ్‌లో కసరత్తు

ఆహ్లాదకరం యతిరాజారావు పార్కు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రం తొర్రూరు. సుమారు 30 వేల పైచిలుకు జనాభా కలిగిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి రోజు సుమారు 2-3 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరులో ప్రజల సౌకర్యార్థం దివంగత నేత నెమరుగొమ్ముల యతిరాజారావు స్మారకంగా ఆయన పేరున ఏడెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. మూడేళ్ల కింద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ. 2 కోట్లు కేటాయించి, అందులో ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, సేద తీరడానికి ప్రత్యేక బల్లలు, హట్స్, చూడముచ్చటైన విగ్రహాలు, ప్రత్యేకంగా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆటవిడుపుగా నిలుస్తోంది. చుట్టూ వాకింగ్‌ట్రాక్, నర్సరీ నుంచి మొక్కలను తెప్పించి నాటడంతో పచ్చందాలను సంతరించుకుంటుంది. అలాగే ఇక్కడ విజయదశమి నాడు రావణవధ కూడా ఘనంగా నిర్వహిస్తారు. క్రీడా పోటీలు, పలు చిత్రాల షూటింగ్‌లు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. నిత్యం 50 నుంచి 100 పిల్లలు కరాటే శిక్షణ పొందుతారు. ఇక సెలవు రోజుల్లో అయితే జనాల రాకతో కిక్కిరిసి కనిపిస్తుంది.

పోలీసుల త్యాగాలతోనే శాంతిభద్రతలు


రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మడికొండ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగ ఫలితమే సమాజంలో నేడు శాంతి భద్రతలు నెలకొన్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కాజీపేట సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మడికొండలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మడికొండ సైయంట్, ఎగ్జాడ్ ఐటీ కంపెనీ యువత, కాజీపేట, కమలాపూర్, భీమదేవరపల్లి, ధర్మసాగర్, హసన్‌పర్తి, వేలేరు, వంగర, ఎల్కతుర్తి ఠాణాల పరిధిలోని దాదాపు 200 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంజీఎం రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డా.ఆశాదేవి, ఏసీపీ తిరుమల్, మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు జె.రాజబాబు, నర్సింహారావు, దివ్య, లవన్‌కుమార్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో ప్రమాణాలు పాటించాలి: హనుమకొండ కలెక్టరేట్: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వారు భద్రతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంగళవారం కమిషనరేట్ పరిధిలో బాణసంచా విక్రయదారులతో సమావేశం నిర్వహించారు.

ఎరువుల నిల్వల పరిశీలన


పరకాలలో గోదాంను పరిశీలిస్తున్న డీఏవో రవీందర్ సింగ్

ఈనాడు కథనానికి స్పందన

పరకాల, న్యూస్‌టుడే: పరకాలలోని రెండు సొసైటీలు, ఓడీసీఎంఎస్, ఆగ్రోస్ కేంద్రాల్లోని ఎరువులను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) రవీందర్ సింగ్ పరిశీలించారు. ఈ నెల 19న 'ఈనాడు'లో 'పక్కదారి పడుతున్న యూరియా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. యూరియా, ఇతర ఎరువుల నిల్వలను, రికార్డులను చూశారు. అధిక ధరలకు అమ్మవద్దని, పక్కదారి పట్టించినట్లయితే బాధ్యులపై చర్యలు తప్పవని డీఏవో హెచ్చరించారు. పరకాల ఏడీఏ రవీందర్, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడుగు పెట్టగలమా..!



హనుమకొండ ప్రాంతం 58వ డివిజన్ స్నేహనగర్ కాలనీ రోడ్డు నెంబర్-4 అధ్వానంగా మారింది. డ్రైనేజీలు సరిగా నిర్మించకపోవడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఎన్జీవోస్‌కాలనీ

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
బాలసముద్రం 81438 11118
పరకాల 9849211303

నయీంనగర్, న్యూస్‌టుడే: నయీంనగర్ ప్రధాన నాలాకు ఆనుకొని నిర్మాణాలు చేపట్టడంతో కాలనీల్లోని మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. వర్షం పడినపుడు పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోంది. **- బాలకృష్ణ, నేతాజీనగర్**

సమాధానం: అంతర్గత వంతెన పనులు పూర్తైన వెంటనే ఆక్రమణలపై దృష్టిసారిస్తాం. మురుగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **- నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే**

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: హసన్‌పర్తి పట్టణంలోని పద్మశాలి క్వార్టర్స్ నుంచి గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గంలో సుమారు 2 కిలోమీటర్ల మేర వీధి దీపాలు లేవు. రాత్రి వేళ చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. **- విజయ్‌కుమార్, హసన్‌పర్తి**

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- గురుమూర్తి శివకుమార్, కార్పొరేటర్**

పైపులైన్‌కు మరమ్మతు..

స్పందనకు వందనం

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని 48వ డివిజన్ దర్గా కాజీపేట బియాబాని నగర్‌లో మూడు నెలలుగా పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతోందని, రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీకి చెందిన బారి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను నగరపాలక సంస్థ ఏఈ శ్రీకాంత్‌కు తెలపగా ఆయన స్పందించి లీకేజీకి మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించారు.

రహదారిపై గుంతను పూడ్చారు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి ఎన్జీవోస్ కాలనీ వెళ్లే దారిలో గోకుల్‌నగర్ కూడలిలో రోడ్డుపై గుంత పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈమార్గంలో గుంతలతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను నగరపాలక సంస్థ ఏఈ శ్రీకాంత్‌కు తెలపగా స్పందించి గుంతను పూడ్పించారు.

బోధన, అభ్యసనాలపై దృష్టి సారించండి


వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నయీంనగర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విద్యార్థులకు అంకిత భావంతో బోధించాలని జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎం.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉన్నత పాఠశాలల్లో పదోన్నతులు పొందిన, ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులకు హసన్‌పర్తి మండలంలోని తేజస్వి, గ్రీన్ ఉడ్ పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటి రోజు తెలుగు, ఆంగ్ల భాషోపాధ్యాయులు హాజరయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖ చేపడుతున్న ప్రతి కార్యక్రమంపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి, విద్యార్థుల శ్రేయస్సు కోసం పాటుపడాలని అన్నారు. ఎంఈవో రవీందర్, రిసోర్స్‌పర్సన్లు నరేందర్‌రెడ్డి, భద్రయ్య, ప్రసాద్, సంపత్‌కుమార్, రోజారాణి, పద్మావతి, వాసు తదితరులు పాల్గొన్నారు

శిక్షణ వేదికల మార్పు..

ఉపాధ్యాయులకు చేపడుతున్న శిక్షణ కేంద్రాల వేదికలు మార్పు చేస్తున్నట్లు డీఈవో డి.వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం హిందీ టీచర్లకు హనుమకొండ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, గణిత ఉపాధ్యాయులకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, 24న జీవ శాస్త్రం వారికి ప్రభుత్వ ప్రాక్టీసింగ్, భౌతికశాస్త్రం వారికి బాలికల ఉన్నత పాఠశాల, 25న సాంఘిక శాస్త్రం టీచర్లకు బాలికల ఉన్నత పాఠశాల, ఎస్జీటీ వారికి ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందని, ఉపాధ్యాయులు గమనించాలని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో విధిగా ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

ఆదివాసీల పోరుబిడ్డ కుమురం భీం


బాలసముద్రంలో నివాళులర్పిస్తున్న భారాస నేతలు

బాలసముద్రం, న్యూస్‌టుడే : జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమించిన యోధుడు కుమురం భీం అని మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కుమురం భీం జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారాస ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా ఒక జిల్లాకు కుమురం భీమ్ పేరుపెట్టి సముచిత గౌరవం కల్పించిందన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమనేత, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి నిర్వహించారు. నాయకులు సుందర్‌రాజ్, యాదవరెడ్డి, పులి రజనీకాంత్, సుంచు కృష్ణ, రామ్మూర్తి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు అధికారుల నియామకం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటున్న పలు డివిజన్లకు వార్డు అధికారులను నియమిస్తూ మంగళవారం రాత్రి గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న 10మంది వార్డు అధికారులు పరకాల పురపాలక సంస్థకు బదిలీ అయ్యారు. వార్డు అధికారులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం, ఇంటి పన్నులు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యమవుతోంది.

పర్యవేక్షకుడి సస్పెన్షన్ ఎత్తివేత

రెండునెలల క్రితం ఫైళ్ల ముద్రణ తప్పిదాలకు బాధ్యుడిని చేస్తూ పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షకుడు జీవన్‌రావును కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సీడీఎంఏ టి.కె.శ్రీదేవి ఆదేశాల మేరకు తాజాగా జీవన్‌రావు సస్పెన్షన్ ఎత్తివేశారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి 7గంటల సమయంలో చోటు చేసుకుంది. కాజీపేట ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. హనుమకొండ నుంచి కాజీపేటకు వస్తున్న పల్లెవెలుగు బస్సును మడికొండకు చెందిన మారపాక సంగీత్‌కుమార్ అనే యువకుడు అడ్డంగా నిలబడి మద్యం మత్తులో డ్రైవర్, మహిళా కండక్టర్‌పై దాడికి యత్నించాడు. ప్రయాణికులు ఆపడానికి ప్రయత్నించగా వారిని తిడుతూ మహిళా కండక్టర్ శోభారాణిపై చేయి చేసుకుని తోసివేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

46 మంది అసైన్డ్ లబ్ధిదారులకు నోటీసులు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మంగళవారం 46 మంది అసైన్డ్ లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ జగత్‌సింగ్ తెలిపారు. ఎల్కతుర్తి శివారులోని వాగు సమీపాన సర్వే నెంబరు 73 లోని 11.27 ఎకరాల భూమిలో గతంలో 46 మందికి అప్పట్లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. లబ్ధిదారులు సాగు చేసుకోకుండా ఉండటంతో ఇసుకాసురులకు లీజుకు ఇచ్చారు. వారు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక దందాపై ఫిర్యాదులు అందడంతో చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నోటీసులకు వారంలోపు సంజాయిషీ ఇవ్వాలని అన్నారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతం చేస్తే చట్టపరంగా కేసులు నమోదు చేసి, భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బాలసముద్రం : గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం హనుమకొండ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఎస్బీఐటీస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శ్యామల గార్డెన్, వాటర్ ట్యాంక్, నాగరాజు దేవాలయం ప్రాంతాల్లో కరెంటు ఉండదని, వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

కాజీపేట టౌన్: జోడుగుట్టలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. కొరివి పవన్‌కళ్యాణ్ అదే ఇంట్లో ఉంటున్నారు. విద్యుత్తు బోర్డులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ నాయకులు హౌసింగ్, ఆర్ఐ శివకుమార్‌తో కలిసి వెళ్లి ఇంటిని పరిశీలించారు. తక్షణ సాయంగా రూ.5 వేలు నగదు, 75 కిలోల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఆప్ప శ్రీకాంత్, కుమార్, షేక్ అజ్గర్, లారెన్స్, సాయినాథ్, విజయ్‌కుమార్, విష్ణు, సామ్యుకుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు

కోచ్ ఫ్యాక్టరీ స్థలం సందర్శన

కాజీపేట, న్యూస్‌టుడే: కోచ్ ఫ్యాక్టరీ సాధన సమితి ప్రతినిధులు మంగళవారం ఫ్యాక్టరీ స్థలాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. వీరితో పాటు భాజపా నాయకులు రావు అమరేందర్‌రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కలగానే మిగులుతుందని భావించిన జిల్లా ప్రజలు కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తున్నారని నాయకులు దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. ఈ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు పెద్ద పరిశ్రమ అవుతుందన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ కోసం తమతో పాటు పలు సంఘాలు సుదీర్ఘకాలం పోరాడాయని అన్నారు. ఆ పోరాటాలు, ప్రస్తుతం కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం తదితర అంశాలతో కలిపి ఒక డాక్యుమెంటరీ తీస్తున్నామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే మద్దతు ధర


బస్తాను తూకం వేస్తున్న అదనపు డీఆర్డీవో సుధీర్, చిత్రంలో తహసీల్దారు సురేశ్‌కుమార్, ఎంపీడీవో బాబు తదితరులు

కమలాపూర్, న్యూస్‌టుడే: రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు డీఆర్డీవో సుధీర్ అన్నారు. మంగళవారం కమలాపూర్ మార్కెట్ యార్డు, ఉప్పల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఈ ఏడాది సన్నరకం ధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్ ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రకాశ్, తహసీల్దారు సురేశ్‌కుమార్, ఎంపీడీవో బాబు, ఎస్సై వీరభద్రరావు, ఏవో లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి రాజా, సూపర్‌వైజర్ యాకయ్య, ఏపీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో సౌర ప్లాంటు ఏర్పాటు

గోపాలపూర్, న్యూస్‌టుడే : 56వ డివిజన్ సప్తగిరి పోలీస్ కాలనీలోని సాయి సేవా ట్రస్టు అనాథ విద్యార్థుల, వృద్ధుల ఆశ్రమంలో క్రెడాయ్ ఆర్థిక సహకారంతో 10 కేవీ సోలార్ విద్యుత్తు ప్లాంట్, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఆశ్రమాన్ని జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ (క్రెడాయ్) అధ్యక్షుడు ఎస్.ఎల్.పాపిరెడ్డి తిరుపతిరెడ్డి సందర్శించినప్పుడు సాయిసేవా ట్రస్టు ప్రతినిధులు సమస్యలను వివరించారు. స్పందించిన క్రెడాయ్ ప్రతినిధులు రూ.7 లక్షలతో సోలార్ ప్లాంటుతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. వీటిని మంగళవారం ఎస్.ఎల్.పాపిరెడ్డి తిరుపతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో క్రెడాయ్ కార్యదర్శి మనోహర్, ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, నాగరాజు, టీఎస్ఎన్‌పీడీసీఎల్ డీఈ సాంబిరెడ్డి, సేవా ట్రస్టు వైస్ ఛైర్మన్ ఎం. ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, రంగయ్య, డా.అనితారెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో బీసీల వాటాకు ఉద్యమం

సంక్షిప్తంగా

బాలసముద్రం, న్యూస్‌టుడే : రాజ్యాధికారంలో వాటా కోసం బీసీలు సంఘటితంగా ఉద్యమించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వాములు అన్నారు. బాలసముద్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జన గణనలో భాగంగా బీసీ కుల గణన చేపట్టాలన్నారు. బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కోరారు. బీసీల సమస్యలపై అక్టోబర్ 28న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు రాజమౌళి, లింగారెడ్డి, ఎల్లేష్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

ఎన్జీవోస్‌కాలనీ, న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని కాకతీయ వీసీ కళాశాల ఆచార్యులు హరిరాంప్రసాద్ అన్నారు. 'రామాయణంలో స్త్రీ పాత్రల అధ్యయనం, వర్తమాన కాలంలో వాటి ఔచిత్యం' అంశంపై రెండ్రోజులుగా వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. వక్తలు పాల్గొని రామాయణ విశేషాలు, వాల్మీకి మహర్షి రాసిన శ్లోకాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 154 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వర్సిటీ అధికారులు

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ వర్సిటీలో మంగళవారం టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ నియామకాలకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థులు 215 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 182 మందిని ఎంపిక చేశారు. అనంతరం వర్సిటీ ఛాన్స్‌లర్ డా.సీహెచ్.పురుషోత్తంరెడ్డి, ఉప కులపతి ఆచార్య జి.దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, ప్లేస్‌మెంట్ అధికారి ఫరీద్ ఎంపికైన వారిని అభినందించారు.

ఇంటర్న్‌షిప్‌నకు కేయూ విద్యార్థులు..


విద్యార్థినులతో ఉప కులపతి ఆచార్య కె.ప్రతాప్.రెడ్డి

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ విద్యార్థినులు పది మంది హైదరాబాద్‌లోని 'ట్రాక్ 3డీ ఏఐ' సంస్థలో ఇంటర్న్‌షిప్‌నకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.భిక్షాలు మంగళవారం తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.7 లక్షలు ఉంటుందని చెప్పారు. డిసెంబర్ నుంచి ఇంటర్న్‌షిప్‌నకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. నియామక పత్రాలు పొందిన వారిని ఉప కులపతి ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అభినందించారు. ప్రాంగణ నియామకాల అధికారి కిరణ్ కుమార్, స్వప్న పాల్గొన్నారు.

జీవో 29పై బీసీ నేతల ఆందోళన



బాలసముద్రం, న్యూస్‌టుడే : జీవో నంబర్ 29కి వ్యతిరేకంగా నక్కలగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ పొలిటికల్ జేఏసీ, ఇంటలెక్చువల్ ఫోరం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ ఛైర్మన్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా 29జీవోను తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలు ఇలాగే కొనసాగిస్తే బీసీలు ఏకమై సత్తా చూపాల్సి వస్తుందని హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నియామకాల్లో సింహభాగం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రజనీకాంత్, నరేందర్, క్రాంతి, వేణు, వైద్యులు కాళి ప్రసాద్, భాస్కర్, లక్ష్మీప్రసాద్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఎంజీఎం ఆసుపత్రి: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ సురేష్‌కుమార్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. అతని కుటుంబానికి వైద్యఆరోగ్యశాఖలోని తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. సుమారు 70 మంది ఉద్యోగులు పోగుచేసిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం హనుమకొండ డీఎంహెచ్ఓ డా.లలితాదేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ డా.మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రమాదం జరిగితే ప్రాణాలకే ముప్పు


వాహనంలో సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్న మహిళా కూలీలు

జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా ప్రయాణాలపై పలువురు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కమలాపూర్‌లోని గూడూరు క్రాస్ రోడ్డు వద్ద ఓ ట్రాలీ ఆటోలో ఏకంగా 30 మంది మహిళా కూలీలు ప్రయాణిస్తూ కనిపించారు. ఆటో ఏమాత్రం అదుపు తప్పినా, ప్రమాదానికి గురైనా వారి ప్రాణాలకు ముప్పే. – న్యూస్‌టుడే, కమలాపూర్

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు

కమలాపూర్, న్యూస్‌టుడే: వంగపల్లి గ్రామానికి చెందిన నకీర్త అయిలయ్య వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన అదే గ్రామానికి చెందిన నకీర్త రమేశ్, నకీర్త ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. వంగపల్లి గ్రామ శివారులో అయిలయ్యకు వారసత్వంగా వచ్చిన 30 గుంటల భూమి ఉంది. దాన్ని అదే గ్రామానికి చెందిన కోడెపాక మధు కౌలుకు సాగు చేస్తున్నారు. నకీర్త అయిలయ్య, నకీర్త రమేశ్ భూముల మధ్య ఉండగా రమేశ్, ప్రశాంత్‌లు అక్రమంగా ప్రవేశించి ఫెన్సింగ్‌ను కూల్చివేశారన్నారు. ఈ నెల 15న ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగినందుకు నకీర్త అయిలయ్య, మధుపై వారు దాడికి వచ్చి, భయభ్రాంతులకు గురి చేసి చంపుతామని బెదిరించారని తెలిపారు. అయిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గూడ్స్ బైపాస్ లైన్‌తో జీవితాలు ఆగం

ధర్మసాగర్: గూడ్స్ రైల్ బైపాస్ లైన్‌తో మా జీవితాలు, పిల్లల భవిష్యత్తు ఆగం అవుతాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్డీవో వెంకటేశ్‌ను కలిసి వినతి పత్రం అందించి తమ గోడు చెప్పుకొన్నారు. నాలుగు మండలాల పరిధిలోని పది గ్రామాల్లో సుమారు 20 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా నష్టపోతారని, 29 వేల ఎకరాల వరకు సన్న చిన్నకారు రైతులం భూములను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ లైన్‌ను ఓఆర్ఆర్ పక్క నుంచి గాని, పాత రైల్వే లైన్ పక్కనుంచి గాని వేసేలా ప్రతిపాదనలు పంపాలని కోరారు. రైల్వే బైపాస్ నిరోధిత సంఘం నాయకులు దామోదర్‌రెడ్డి, వీరన్న, వెంకట్రామ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రావుల వేణుమహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, ధర్మసాగర్, హసన్‌పర్తి, కాజీపేట మండలాల రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి సమాజసేవ శిక్ష

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడిపిన ఏడుగురు వ్యక్తులకు కోర్టు సమాజ సేవ శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. నగరంలోని మూడు స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 107 మందిని కోర్టులో హాజరుపరచగా అందులో 100 మందికి రూ.1.42,400 జరిమానా, ఏడుగురికి రెండ్రోజుల పాటు సమాజ సేవ చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఏసీపీ తెలిపారు. పైతీర్పును అనుసరించి వారిని గ్రేటర్ వరంగల్ కమిషనర్, కాజీపేట నగరపాలక డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించినట్లు చెప్పారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 14 మందికి రూ.12 వేలు జరిమానా విధించారన్నారు.

నూతన పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన రెండు గ్రామ పంచాయతీలకు కలెక్టర్ ప్రావిణ్య మంగళవారం ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరభద్రపల్లికి ఎల్.పద్మ (ఏవో), సాయినగర్ పంచాయతీకి ఎస్.వీరేశం (ఎంపీడీవో)లను నియమించారు. పాత పంచాయతీల నుంచి వీటి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో వీరేశం తెలిపారు.

నిట్‌లో అంతర్జాలం ద్వారా సదస్సు

నిట్ క్యాంపస్, న్యూస్‌టుడే : వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ (నిట్)లో మంగళవారం నుంచి అంతర్జాలం ద్వారా సదస్సు ప్రారంభమైంది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ - థియరీ ప్రాక్టీస్, ఎమర్జింగ్ అప్లికేషన్స్' అనే అంశంపై ఈ నెల 31 వరకు సదస్సు కొనసాగనుంది. నిట్ డైరెక్టర్ ఆచార్య బిద్యాధర్ సుభూది ఈ సదస్సును ప్రారంభించారు. పలు ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి అతిథులు పాల్గొని సందేశమిచ్చారు.

ఎన్ఎస్ఎస్ శిబిరానికి ఎంపిక

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆరుగురు నవంబర్ 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జల్గాం, కేబీసీలో జరిగే వెస్ట్‌జోన్ వాలంటీర్ల ప్రీ రిపబ్లిక్‌డే శిబిరానికి ఎంపిక అయినట్లు కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ తెలిపారు. వారిలో వెంకన్న, నాగరాజు, రామచరణ్, అంజలిదేవి, దివ్య, ఇందుప్రియ ఉన్నారన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: అర్హులైన ఉపాధ్యాయులు అందరూ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పింగిళి కోరారు. మంగళవారం ధర్మసాగర్, నారాయణగిరి, ఎలుకుర్తి పాఠశాలల్లో ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి, పలిత శ్రీహరి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జాన్‌సింగ్, రఘోత్తంరెడ్డి, బండ రమేష్, శ్రీనివాస్, మాధవి, అంజయ్య, సరస్వతి, తులసి, యమునశ్రీ, భానుప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బకాయి డీఏ వెంటనే విడుదల చేయాలి

మడికొండ, ధర్మసాగర్, విద్యానగర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు బకాయి డీఏలను వెంటనే విడుదల చేయాలని నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మడికొండ గురుకులం, ధర్మసాగర్ బాలుర, బాలికల పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల అధ్యాపకులను కలిశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రాజు, పెండెం రాజు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

వేలేరు, న్యూస్‌టుడే: వేలేరులోని తెలంగాణ బాలుర గురుకుల విద్యాలయానికి చెందిన ఆరుగురు విద్యార్థులు రెండు క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ రౌతు అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఖోఖో అండర్-14లో డి.నరేష్, డ్రమ్స్ విభాగంలో అభిషేక్, సాయి, అంజి, సాజిద్ సాహు, అశ్వత్ ఎంపికయ్యారని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం. వెంకటేశం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నర్సరీల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వెంకటేశం అన్నారు. మంగళవారం గుడెప్పాడ్‌లో మిరప, కూరగాయల నర్సరీలను తనిఖీ చేశారు. వెంకటేశం మాట్లాడుతూ నాణ్యమైన మొక్కలతో పాటు, కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుంటే నర్సరీ యజమానుల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. అనంతరం ఆయిల్‌పాం తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఉద్యాన అధికారి రాకేశ్, పరకాల ఉద్యాన అధికారి మధులిక, రైతులు పాల్గొన్నారు.

రూ.1.80 కోట్ల బాణసంచా పట్టివేత

హనుమకొండ కలెక్టరేట్: నగరంలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా పెద్దఎత్తున పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల మేరకు.. వరంగల్ బీట్‌బజార్‌లోని వజినేపల్లి రమేశ్ అండ్ బ్రదర్స్, శ్రీసాయి ఫైర్స్ అండ్ క్రాకర్స్ నిర్వాహకులు అనుమతి లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినట్లు సమాచారం అందింది. మంగళవారం రాత్రి మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్ ఠాణా పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. సుమారు రూ.1.80 కోట్ల బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై శరత్ కుమార్, సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.